# కొత్త అల్లుడు

## -సోమాశి శ్రీనివాసమూర్తి

ఆరోజు జనవరి పదోతేదీ వర్కింగ్ అవర్స్‌లో లాస్ట్ పీరియడ్‌నాది. గబగబా లెసన్ పూర్తికావడంతో హడావుడిగా స్కూటర్ మీద బయలుదేరాను. కెమిస్ట్రీ కాంతారావుగారు కనిపించి 'ఏమోయ్ వాసూ! మా యింటికి ఎవరో రెలిటివ్ వచ్చారట ఫోన్ వచ్చింది. కాస్త మాయింటి దగ్గర డ్రాప్ చెయ్యవయ్యా' అంటూ స్కూటర్ మీద వెనకాల కూర్చున్నాడు.

త్వరగా ఇంటికి వెళ్ళాలని ఆతృత పడుతున్న నేను, కాసేపు తటపటాయించి, ఎప్పుడు ఏదీ అడగని మనిషి, ఏం కాదంటాంలే అని, స్కూటర్ గేరు మార్చాను. రెండు అడ్డరోడ్లు దాటాయో లేదో ఆయనే అందుకున్నాడు. ''ఏమోయ్ ఎలా వుంది కొత్త జీవితం''

పుట్టింటికి వెళ్ళిన భార్య చుట్టు తిరుగాడుతున్న ఆలోచనలకు ఆ ప్రశ్న దగ్గరగా వుండటంతో నేను స్పృహలోకి వచ్చాను.

''ఫైన్ సార్'' అన్నాను.

''ఫైన్ ఏమిటోయ్ తేలిగ్గా ఫెంటాస్టిక్‌గా వుండాలి. అసలు కొత్తగా పెళ్ళయిన జంట ఎలావుండాలో తెలుసా? గంధకం నిప్పులా వేడిగా, భాస్వరం మంటలా చురుకుగా వుండాలి. ఇద్దరిమధ్యా 'ప్రేమ' జీవితానికి ఆక్సిజన్‌లా పనిచేయాలి.''

''సార్! మేం బానే వుంటాము సార్'' నన్ను అమాయకుణ్ణి చేసి మాట్లాడుతుంటే నేను భరించలేకపోయాను.

ఆయన వాయించేస్తాడేమోనని నాకు భయం పట్టుకుంది. స్కూటర్ స్పీడ్ పెంచాను.

''అంతెందుకు, నా లైఫ్ చూడు. ఇంటికెళ్ళగానే మా ఆవిడ కాఫీ ఇస్తుంది ప్రేమగా. దానితోపాటు కోర్కెల లిస్టూ, అఫ్‌కోర్స్ చిర్రుబుర్రులు కూడా తోడవుతాయనుకో...''

''ఇన్ని చెప్తున్నారు. మా సిస్టర్‌ని మీరు ప్రేమగా చూసుకుంటారా?'' నాకన్నా ఏడెనిమిదేళ్ళే పెద్దవాడవడంతో సరదాగా అడిగేశాను.

''ఊ!..రియల్లీ, అప్పుడప్పుడు ప్రేమ ఉన్నట్లూ లేనట్లూ కూడా నటించాలయ్యా!''

''ఈమాట మాత్రం తప్పకుండా మా సిస్టర్‌కి చెబుతాను'' ఇంటి ఎదురుగా గేటుముందు స్కూటర్ ఆపుతూ అన్నాను.

''ఆ పని మాత్రం చెయ్యకు'' అంటూ స్కూటర్ దిగి ''మాయింట్లో పెద్ద తుఫాన్ వస్తుంది'' నవ్వుతూ చేయి ఊపి లోపలికెళ్ళాడు కెమిస్ట్రీ కాంతారావు.

బండి రివర్స్ చేసి మధ్యాహ్నం మా ఆవిడ చేసిన 'ఫోన్ కాల్' గుర్తురావడంతో ఆలోచనలటు మళ్ళించాను.

రీడింగ్ రూంలో పేపర్ చదువుకుంటున్న నాదగ్గరకి పరుగున వచ్చాడు అటెండర్ సత్తిబాబు.

''సార్! సార్! మీకు ఫోన్ కాల్''

''ఎక్కడినుంచయ్యా?'' అడిగాను నేను.

''ఏమోసార్! ఎస్.టి.డి లైన్‌లోనే వున్నారు'' అన్నాడు.

గబగబా వెళ్ళి ఫోన్ అందుకున్నాను మా ఆవిడేమో అనుకుంటూ.

''హలో!'' అనగానే, ''హలోనేనండీ!'' స్వీట్‌గా వినిపించింది, వాయిస్. ఒంట్లో రక్తం వేగంగా పెరిగెత్తనారంభించింది. గుండెమోతలు పెద్దవయ్యాయి. సహజమే కదా! దీపావళికెళ్ళిన మా ఆవిడ రెండునెలల నుంచీ అక్కడే వుంది.

దీపావళి పండక్కి తీసుకెళ్ళడానికి మా మామగారొచ్చారు.

''అల్లుడూ! నిన్నూ అమ్మాయిని పండక్కి తీసుకెళదామని వచ్చాను. మీరెప్పుడు బయలుదేరదామంటే అప్పుడు బయలుదేరదాం'' అనగానే, ఏమి చెప్పాలో నాకర్థం కాలేదు. కారణం-

మా మామగారు పెళ్ళయ్యాక మొదటి పండగ కదా అనీ; దసరాకి రమ్మని ఉత్తరం వ్రాస్తే, సరేకదా అని బయలుదేరాం. తీరా అన్నీ సర్దుకున్నాక మా బామ్మ ప్రయాణం ఆపించింది.

''ఒరే బడుద్ధాయ్! పిలవంగానే పరుగెత్తకూడదురా, కాస్త బెట్టుచేయాలి'' అంటూ. ఆమాట అంతగా రుచించలేదు.

''బామ్మా! ఇంకా ఈరోజుల్లో కూడా ఏమిటా బెట్టు, వాళ్ళ పిల్లని మనం చేసుకున్నాక, వాళ్ళు మనం ఒకటి కాదుటే!''

''ఏడ్చినట్లే వుంది. ఇంట్లో కొత్తగా అమ్మవార్ని పెట్టుకుంటున్నాము-పొలోమని కొంగు బిగించి పుట్టింటికిపోతే ఇక్కడ దీపం వెలిగించేదెవర్రా అంట? ఇక్కడ కాదట్రా పెళ్ళయ్యాక మొదటి పండగ?'' అంటూ ఎత్తుకుంది బామ్మ.

సరేలెమ్మని పెద్దదాని మాటకి విలువిచ్చి ప్రయాణం ఆపేశాను. అదీకాక మా ఆవిడ కూడా ''పోనీలెండి, మొదటి పండగ కదా! ఇక్కడే చేసుకుందాం. పెద్దావిడన్నట్లు మనం వెళితే ఇక్కడ దీపం వెలిగించేదెవరు'' అంటూ వత్తాసు పలికింది.

అంటే మా మరదలు మూడుపేజీల ఉత్తరం వ్రాసింది. పుట్టి బుద్ధెరిగాక, ఇన్నాళ్ళు మా అక్కను విడిచి వుండలేదు. మీరు పండక్కి వస్తే బెంగ తీర్చుకుందామనుకున్నాను అంటూ వాళ్ళక్కేదో తన సొత్తయినట్లు ఫీలయిపోతూ నిష్ఠూరాలాడింది. మామగారిక సరేసరి. ''పెద్దల్లుణ్ణీ, చిన్నల్లుణ్ణీ కూడా పిల్చుకున్నాం. కొత్త అల్లుడు కదా. మీరు కూడా వస్తారని వాళ్ళు కూడా ఎంతో ఉత్సాహంగా వచ్చారు. మీరు అమ్మాయి రాకపోవడం మా మనసుకి ఎంతో బాధేసింది'' ఉత్తరం రాసారు.

పదిరోజులు తిరక్కముందే దీపావళికి ఆహ్వానిస్తూ మరో ఉత్తరం దానివెనకే మా మామగారూ రావడం జరిగింది.

ఈసారైనా తప్పక రండంటూ గట్టిగా చేయి నొక్కి మరీ చెప్పారు. బామ్మతో కూడా మరీ మరీ చెప్పడంతో ''సరే రెండురోజులాగి సెలవలు చూస్కొని అబ్బాయిని పంపిస్తాను. అమ్మాయిని తీసుకెళ్ళండి'' అనడంతో మరీ మరీ రమ్మని చెప్పి వాళ్ళిద్దరూ వెళ్ళారు. పండగ రెండురోజులు వుందనగా ''వెళ్ళొస్తానే బామ్మా!'' అన్నాను.


''ఎక్కడికిరా?'' అంటూ సాగదీసింది.

''అదేమిటే అన్నీతెలిసి అట్లా మాట్లాడతావ్! పండక్కి పంపించమని నీకే కదా, చెప్పివెళ్ళారు'' అన్నాను.

''అమావాస్య పండక్కి అసలెళ్ళకూడదు. పెళ్ళయ్యాక వెళ్ళే మొదటి పండగ. ఈసారి కాదు. తరువాత వెళ్ళచ్చులే'' అంది.

''వెళ్ళకపోతే వాళ్ళు పీలవుతారు. అర్థం చేసుకోవే'' బ్రతిమాలాను.

టపాసులకి మీ మామగారి డబ్బులే కావాలా! చిల్లర నేనిస్తాలే!'' ఓ జోకేసి తప్పుకుంది బామ్మ. రెండురోజుల ముందే



21 చుక్కలు 3 వరుస
ఎమ్.కిరణ్మయి (వర్తికాంత)

వాళ్ల నాన్నతో వెళ్ళింది కాబట్టి తను బాధ పడుతుందనే బాధ నాకు లేకుండాపోయింది.

''తీసుకెళ్ళేవాడు నిన్ను కూడా మొన్నే తీసుకెళ్ళచ్చుకదా! వాళ్ళమ్మాయి సరిపోతుందిలే నువ్వెందుకు వెళ్ళడం?'' అనీ దెప్పుతూ ప్రవేశించింది బామ్మ.

''అలాకాదులేవే అనవసరంగా ముందే సెలవు పెట్టడం ఎందుకని. నేనే తరువాత వస్తానని చెప్పాను.''

''వస్తానని చెప్పావా! ఇహ నన్నడగడం దేనికి, బయలుదేరు'' అంది.

''అలా కాదు బామ్మా. ఇప్పుడు నేను వెడితే పండగ, అయిపోగానే దాన్ని తీసుకురావడానికి వీలవుతుంది'' అని చిన్నపిల్లాడికి చాక్లెట్ కొనిస్తానన్నంత తేలిగ్గా చెప్పాను.

అంతే, గయ్‌మని లేచింది.

''ఏం ఫరవాలేదు. తీసుకెళ్ళినవాళ్ళే మళ్ళీ దిగబెడతారు. నాకు నీతో కలిసి పండగ చేసుకోవాలని వుంది. నువ్వు కూడా వెడితే నేనొక్కదాన్నీ కూర్చొని చేసుకోనా పండగ. నా మాట విను'' అనడంతో మళ్ళీ ఆగిపోయాను.

మామగారైతే మెత్తని చివాట్లు పెట్టారు ఫోన్‌లో. అఫ్‌కోర్స్! మా బామ్మతో పోల్చుకుంటే అవో పెద్ద లెక్కలోవి కాదనుకోండి-

ఈ రెండు నెలల్లో మాయావిడ 4, 5 ఫోన్ కాల్స్ చేసింది. ప్రతిసారీ అదే టెన్షన్. తను వ్రాసిన ఉత్తరం అందుకోవాలన్నా, తనకు నేను వ్రాయాలన్నా ఇదే పరిస్థితి. పెళ్ళయి నిండా పదినెలలు. అందులో రెండు నెలలు తను పుట్టింట్లోనే వుంది. ఎందుకో సత్యని తలచుకోగానే నరాల్లో తెలియని ఉద్రేకం ఆవహించింది.

బహుశా కొత్తగా పెళ్ళయిన వాళ్ళందరికీ ఇంతేనేమో!

''హలో! నేనండీ, సత్యని ఎవరూ మాట్లాడేది మీరేనా?'' వినిపించడంతో స్పృహలోకి వచ్చాను.

మాట్లాడరేంటి, మూర్తిగారేనా మాట్లాడేది?

''ఆ..ఆ..నేనే ఏంటి... కులాసానా?''

''ఏం లేవు..నేను కులాసానే. మీరెట్లా వున్నారు?''


''బావున్నాను. ఇంకేంటి విశేషాలు?''

''ఏం లేదు. మా నాన్న ఉత్తరం వ్రాసారు. అందిందా?''

''లేదు. అందలేదే..ఏంటి విశేషాలు?''

అంతే అవతలి గొంతులో అనుకోని మార్పు కనిపించింది.

''అందలేదా? ఈవిధంగా తప్పించుకోవాలని చూస్తున్నారేమో. అదేం కుదరదు. ఉత్తరం వ్రాసి ఐదు రోజులయింది. ఉత్తరం అందే వుంటుంది. మీ బామ్మ మీకీ విషయం చెప్పకుండానన్నా వుండాలి. లేదా, ఉత్తరం అందలేదన్న సాకుతో పండక్కి రాకుండా ఎగ్గొట్టే ప్లానయినా వేసుండాలి''



''అయ్యో లేదు సత్యా! నిజమే చెప్తున్నాను. ఉత్తరం అందలేదు. ఇవన్నీ నాకనవసరం. మీరు పండక్కి వస్తున్నారు. దట్సాల్!'' మారు మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది.

అంతే బామ్మ మీద ఎక్కడలేని కోపం వచ్చేసింది. ఇంటికెళ్ళి యుద్ధం చేద్దామనుకున్నాను. గేటు నెట్టుకుంటూ వెళ్ళి స్కూటర్ స్టాండ్ వేశాను.

అంతే ఆవేశం కట్టలు తెంచుకుంది. ''బామ్మా! శోభనమప్పుడు పోయాను మా మామగారింటికి, మళ్ళీ యింతవరకూ వెళ్ళానా? నీమాట వినేకదా! మానేశాను..''

''ఆ విన్నావ్‌లే సంబడం..మరిచాను రోయ్ మీ మామ ఉత్తరం వ్రాసాడ్రా..''

అంతే అప్పటిదాకా ఉన్న కోపం ఎక్కడికి పోయిందో తెలియదు.


''ఏంటే బామ్మా?'' అన్నాను.

అవున్రా పండక్కి రమ్మని ఉత్తరం వచ్చింది.

''ఏదీ ఉత్తరం?'' అంటూ లోపలికి వెళ్ళాను.

''అదిగో టేబుల్ మీదుంది. ఏం వెళ్లొస్తావా?''

అంది బామ్మ ఎకసెక్కంగా. బామ్మా నిన్ను చంపెయ్యాలే అనుకుంటూ ఓ ఫీలింగిచ్చి ''తమరు అనుమతివ్వాలి కదా?!'' అన్నాను, ఉడుక్కుంటూ.



''ఏడిశావ్‌లే, అన్నీ నేను చెప్తేనే చేస్తున్నట్లు. సెలవు చూసుకుని బయలుదేరు'' అంది.

''రేపటినుంచీ సెలవులే. రాత్రికి బయలుదేరతాను''

''ఒక్కదాన్నే ఒదిలేసి పోతావా? నేనూ వస్తున్నాను. ఇద్దరం కలిసే పోదాం'' అంది బామ్మ. ఒక్కదాన్ని వదిలేయడం నాకు ఇష్టం లేక రాత్రికి ఇద్దరం బయలుదేరాం.

గుంటూరులో ఓ ప్రైవేటు బస్సెక్కి తెల్లవారేసరికి హైదరాబాద్ చేరుకున్నాం. బస్సు దిగి ఆటోలో నల్లకుంట చేరుకునేసరికి సమయం అయిదు అయింది. చలికాలం కదా! ఎవరూ నిద్దర్లు లేవలేదు.

ఎదురుగా వున్న బొచ్చుకుక్క మాత్రం కయ్యిమంటూ స్వాగతం పలికింది. నిద్రలేచి మా మరదలు కాళ్లు కడుగు నీళ్లివ్వడం, మామగారు అత్తగార్ల పలకరింపులు, బావమరిది వళ్లు విరుచుకుంటూ, ''ఏం బావా! ఇన్నాళ్లకు కనిపించిందా మా ఇల్లు అనడం, బావమరిది పెళ్లాం కాఫీతో ఎంటరవడం చకచకా జరిగిపోయాయి.

కాఫీ తాగుతూ బామ్మ, మా అత్తగారు కబుర్లలో పడితే, కాళ్లు నాకుతున్న బొచ్చు కుక్క తలమీద నిమురుతూ అటూ ఇటూ చూస్తున్నాను. నన్ను గమనించింది కామోసు మా బావమరిది పెళ్లాం 'ఎవరి కోసం? ఓహో! అదిగో అక్కడ!'' అంటూ పక్క గదిలోకి చూపించింది. తలెత్తి చూసేసరికి, నిండా దుప్పటి కప్పుకుని కూర్చుని కనిపించింది సత్య.

ముద్దబంతి పువ్వులా నవ్వుతూ, మూడువేళ్లు చూపిస్తూ మూడురోజుల సెలవు తీసుకున్నానంటూ సైగ చేసింది. అంతే పండక్కి పెడదామనగానే ఒప్పుకున్న మా బామ్మ మీద ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది. ఏం చేస్తోందో అనుకుంటూ అటు తిరిగాను. విలాసంగా నవ్వుకుంటూ మా అత్తవారితో కబుర్లాడుతూ ఎంజాయ్ చేస్తోంది బామ్మ. నాకు నీరసం ఆవహించిందని వేరే చెప్పాలా?

★